# తిరుమలదేవి

శ్రీమతి గొల్లపూడి అన్నపూర్ణమ్మగారు

నాడు పౌర్ణమియగుటచే చంద్రుడు పరిపూర్ణమైన కళలతో ప్రకాశించుచుండెను. పగలు విశేషముగ యుద్ధముచేసి యుండుటచే సైనికులు గుడారములందు గాఢముగ నిద్రించుచుండిరి. కావలివారు మాత్రము కడుజాగరూకతతో గుడారములు కాయుచుండిరి. ఆ నిశ్శబ్దసమయమున అప్పుడప్పుడు చేయు గుర్రముల సకిలింపులతోను, కావలివారి 'హారాహుహారు' అను హెచ్చరికలతోను ఆ నిశ్శబ్దమున కంతరాయము గల్గుచుండెను. ఆ గుడారముల కనతిదూరమున నొక చక్కని చిన్నగుడారము వేయబడియుండెను. గుడారము బైటను మంచముపై ప్రభువగు కృష్ణదేవరాయలు పండుకొని కోటముట్టడినిగూర్చి దీర్ఘముగ మంత్రి యగు తిమ్మరసుతో నాలోచించుచుండెను. అంతలో కావలివాడు "ప్రభూ! తమకొరకెవరో వచ్చియున్నార"ని చెప్పెను. కృష్ణదేవరాయలు ఇంచుక యోచించి యా క్రొత్తవానికి రా సనుజ్ఞయిచ్చెను. ఆ నూతనపురుషు డరుదెంచి కృష్ణదేవరాయనకు నమస్కరించెను. కృష్ణరాయులు "నీవెవర" వని ప్రశ్నించెను. "దేవా! నేను ఉత్కళేంద్రుని ముఖ్యసేనానిని. తమచే యిట్లు కోట ముట్టడింపబడియుండుటచే మా ప్రభువువారు సభచేసి కర్తవ్యమేమని యందరి నడిగిరి. దానికి నేను యాతని కుమార్తెయైన తిరుమలను తమకొసంగి సంధి చేసికొనిన బాగుండునని సలహానిచ్చితిని. అందుపైని వారందరు నన్ను పరాభవించి యావలకు పొమ్మనిరి. ప్రభూ! యిచటి కనతిదూరమున ఒక రహస్యమార్గము గలదు. దానిగుండా కోటను సులభముగ వశపరచుకొనవచ్చును" అని చెప్పెను. కృష్ణరాయలు, తిమ్మరసు గుడారములోని కేగి యేదియో ఆలోచించుకొని యావలికి వచ్చి "ఓయీ! నీవు చెప్పినదానియందు యించుకేనియు నసత్యమున్న నీదేహముపై నాశయుండ"దనియెను.

౨

తిరుమల యుత్కళేంద్రుని తనయ. పదునారు వత్సరముల ప్రాయముగల చక్కని చుక్క. తాను ఇదివరలో నారుమాసముల వెనుక నొక సందర్భమున నొక ఛాయాచిత్రమును చూచియుండెను. ఆ ఛాయాచిత్రమునందుగల పురుషునిగూర్చియే యామె యా యర్ధరాత్రియందు తన భవనముప్రక్కనున్న యుద్యానవనములో కూర్చుండి యోచించుచుండెను. ఆమె యొక పెద్ద నిట్టూర్పువిడచి, "ఆహా! యీ చిత్రపటమునందుగల పురుషుని నామధేయమైనను తెలియదాయెను. నాకు పటమొసంగిన నాచెలి యాతని నామము తన భర్త నడిగి తెలిపెదనని నేటికిని రాదయ్యెను. అయ్యో! యీ సుందరపురుషుని వివాహమాడని నా జన్మమేల?" అని మాటిమాటికి ఆ చిత్రపటమును చూచుచు

745

పరిపరివిధముల తలపోయుచుండెను. ఇంతలో తండ్రిగారి యాజ్ఞయగుటచే ఆమె యాలోచనల కంతరాయము కలిగెను.

౩

"సభాసదులారా! నేటితో మన కోట వినాశనముగాక తప్పదు. మనకు కృష్ణరాయునితో సంధి కుదరదు. నేను బ్రతికియుండగా ఆ కులహీనునకు నా తనూజాతనిచ్చి పెండ్లిసేయను. శత్రులవశము గాకుండ అంతఃపురస్త్రీలను చంపివేయుడు. కాని నా ముద్దులతనయయైన తిరుమలను చంపవలదు" అని యుత్కలేంద్రుడు తన కుమారైవైపు తిరిగి "తల్లీ! నిన్ను పదునారు వత్సరములు గారాబముతో పెంచితిమి. నాకు పుత్రులు లేమిచే నీయందే గంపంత యాశతోవున్నాడ. కాని నేటితో మన కోట శత్రువశముగాక తప్పదు. మేమందరమును శక్తియున్నంతవరకు పోరి వీరస్వర్గ మలంకరించెదము. కనుక నీవు నీకు యిచ్చవచ్చిన రాకుమారుని వరించిన యాతడు నిన్నిటనుంచి తప్పించుకొని యెచటికైన యేగగల''డని చెప్పెను. దానికి తిరుమల తనలో "ఆహా! నేను నా చిత్రపటమునందుగల పురుషుని యెట్లు చేరగలనని" యోచించి తుట్టతుదకు సభికులతో "ఈ యుత్కలేంద్రుని యీ యాపదనుండి యెవరు రక్షింతురో వారినే వరించెద" ననియెను.

రాజపుత్రులెల్లరు ఒకరినొకరు చూచుకొని దీర్ఘాలోచనాపరులైరి. ఇంతలో ఒక సుందరపురుషుడు లేచి "నేను రక్షించెద" ననియెను. అప్పుడు మిగిలినవారందరును కడురోషముతో "యోరీ దాసీపుత్రా! తుచ్ఛా! కృష్ణదేవరాయా!" అని యందరు నిలువబడిరి. కాని యేమి లాభము? వేనవేలు సైనికులు కోటను ముట్టడించిరి. ఆ పురుషుడు వారివైపుచూచి "మీ రోషములతో మాకు పనిలేదు. కోట మా స్వాధీనమైనది. మీరు వివాహమున కంగీకరించనియెడల మిమ్ములనందర చెరకొనెద" మనియెను. ఉత్కలేంద్రుడు చేయునదిలేక తన నలుగురైదుగురు సభ్యులతోను తన తనయతోను నేదియో యాలోచించుటకు వెళ్లెను. మారువేషముతోనున్న తిమ్మరసు కూడ వారివెంట నరిగెను. ఆ మరుక్షణముననే యుత్కలేంద్రుడు తన కుమార్తెను కృష్ణరాయునికి వివాహముచేయుట కంగీకరించి సంధి చేసుకొనియెను.

౪

"కృష్ణరాయ ప్రభూ! యీ కల్పిత విగ్రహమును యీ మంచముపైనుంచి మీరు ప్రక్కనుండి రహస్యముగ పొంచి చూడు"డని తిమ్మరసు చెప్పెను.

పరిచారికలు తిరుమలను తీసుకవచ్చి యాగదిలో వదలిపోయిరి. తిరుమల క్రీగంట మంచముపైనున్న కృష్ణరాయుని వీక్షించుచుండెను. ఆమెకు కోపము రెట్టింపయ్యెను. "ఆహా! యీ క్రూరాత్ముడు నన్ను చేపట్టదలచెనా! నా ప్రాణముపోయినను చిత్రపటమునందుగల పురుషునితప్ప యింకొకని ప్రేమింతునా? నా పెద్దల యాజ్ఞానుసారము వీని నిదే తుదముట్టించెద"ననుచు

746

పైటకొంగుననుంచిన బాకునుతీసి యావిగ్రహమును పొడచివేసెను. ఆ తొందరలో తన పైటచెంగున నిడుకొన్న ఛాయాచిత్రము నేలపై బడెను. ఏమి యాశ్చర్యము? ఆ పటమునందుగల పురుషుడే యా మంచముపై నున్నవాడు. తిరుమల యది గ్రహించి "హా! నే నేమిచేసితిని? నా ఛాయాపటమునందుగల నా మోహనమూర్తిని చంపుకొంటినా? అయ్యో! ఆ చిత్రపటమునందుగల నా ప్రియుడు కృష్ణరాయడా? ఆహా! నిదానించిచూడక నా మనోవల్లభుని, నా జీవితేశ్వరుని, నా చిత్రపటమునందుగల నా మోహనాంగుని చంపుకొంటిని. తండ్రీ! నీతనయ నధోగతిపాలొనరించితివి. హా! ప్రాణేశ్వరా! కృష్ణరాయప్రభూ! నీ ఛాయాచిత్రము ఆరునెలలనుంచి చూచి నిన్ను వలచుచుంటిని. కాని యాతడు నీవని తెలియకపోయినది. ఓ తండ్రీ! నా ప్రాణవల్లభుడు, నా కృష్ణరాయుడు లేని జీవమేల? ప్రియా! ఇదిగో నీ ప్రాణేశ్వరి నిన్ను కలుసుకొనుటకై నీ వెనువెంటనే వచ్చుచున్న"దని బాకుతో పొడుచుకొనుటకు తిరుమల సంసిద్ధురాలై యుండెను.

"అంత సాహసమువలదు. నీ ప్రాణప్రియుడు కృష్ణదేవరాయలైన నీ ప్రేమవర్షమిటు కురిపింపు" మని కృష్ణదేవరాయలు బైటకువచ్చెను. ఆబాలిక యాశ్చర్యమునకు మేరలేదు. ఆమె వణకుతూ "నే.....బా.....కు.....తో.....పొ.....డ.....చి.....న.....దె.....వ.....రు?"

"ప్రేయసీ! అది కల్పితవిగ్రహము. ఇక నీ ప్రేమసాగరము నాపై పొరలింపుము."

"ఆహా! నా ప్రేమమూర్తి, నా చిత్తచోరుడు, నా ఛాయాచిత్రమునందుగల కృష్ణదేవరాయుడున్నాడా?" ఆ మరుక్షణముననే ఒకరి కౌగిట నొకరుండిరి.

## పల్లెపిల్ల

గవను వేంకటకృష్ణయ్యగారు

నిటలేందు రేఖపై నీటుగాగోటితో దిద్దితీర్చినబొట్టు తేమగిల్ల
కుదురునిండిసకులు, గబ్బిగుబ్బలుపైని తారహారావళుల్ తాండవింప
ఘట్టించుదంతాలధావళ్యరుచితోడ బింబాధరముపాండురంబునొంద
తుమ్మెదబంతులందోసిరాజను నీలకుంతలంబులు వెన్కగునిసియాడ

పంటదేవేరి రూపుచేపట్టినట్టు
సెంకులీగాళ్లపై గాళ్లరెంటినుంచి
తెడవ్రుచాలంగ బోదనుతత్తరాన
త్వరితగతి నేతమెత్తె మాపల్లెపిల్ల.